

## 2

## కోహ్ కేర్, కాంబోడియా

**కాంబోడియా** దేశంలోని పవిత్ర నగరం. నాలుగున్నర చదరపు మైళ్ల విస్తీర్ణంలో నెలకొన్న దేవాలయాల సముదాయమే కోహ్ కేర్. ప్రసాత్ థామ్ అనే ఏడంతస్తుల పిరమిడ్ ఇక్కడి ప్రసిద్ధ నిర్మాణం. రకరకాల శిల్పాలు, రాతి చెక్కడాలు, కొలనులు, పురాతన నిర్మాణాలతో పెనవేసుకుని భారీగా పెరిగిపోయిన చెట్లు ప్రధాన ఆకర్షణ. దగ్గరి విమానాశ్రయం సియెమ్ రీప్.

## ముస్తాంగ్, నేపాల్



## 3

**నేపాల్ హిమాలయ** దేశంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ముస్తాంగ్ ప్రాంతం చూపు తిప్పుకోనివ్వని అన్నపూర్ణ, ధవళ గిరి హిమగిరులు, పర్వతాల మధ్య మలుపులు తిరుగుతూ లోయల్లో హొయలొలికే నదులు, మంచుకొండల నుంచి నెమ్మదిగా జాలువారుతున్న హిమనదాలు, ఎత్తుపల్లాలతో కూడుకున్న లోయలు, జడలబర్రెలు, గొర్రెలతో ముస్తాంగ్ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది. మనదేశానికి పొరుగునే ఉండే నేపాల్‌లో పర్యటన సులభమే.

## అల్మాటీ, కజక్‌స్తాన్



## 4

**మధ్య ఆసియా** దేశం కజక్‌స్తాన్‌లో అతిపెద్ద నగరం. పురాతనమైన సిల్క్‌రోడ్‌లో వెలసిన అల్మాటీ కజక్‌స్తాన్‌లో అత్యంత అందమైన నగరం. ట్రాన్స్ ఇలి ఆల్టాయ్ పర్వతాల నేపథ్యంతో ఉండే అల్మాటీ మంచి ప్రణాళికతో, దారికి రెండువైపులా చెట్లతో కూడిన రోడ్లు, లెక్కలేనన్ని పార్కులు, తోటలతో సందర్శకులకు మధురానుభూతులను అందిస్తుంది. ఇక్కడి అసెన్షన్ కేథడ్రెల్ ప్రపంచంలోనే రెండో అత్యంత ఎత్తయిన కొయ్య కట్టడం. దీన్ని 1907లో నిర్మించారు.



## డొమినికా

## 5

**కరీబియన్ దీవుల్లో** కొలువైన 750 చదరపు కిలోమీటర్ల దేశం డొమినికా. అగ్నిపర్వతాలు, ఉష్ణమండల వర్షారణ్యాలు, అంతెత్తునుంచి జాలువారే జలపాతాలు ఇక్కడి ఆకర్షణ. అందుకే దీన్ని ‘ప్రకృతి ద్వీపం’ (నేచర్ ఐలాండ్) అని పిలుచుకుంటారు. దట్టమైన అడవులు, అందమైన రోజో లోయ, దాదాపు 200 అడుగుల వెడల్పుతో.. పొగలుకక్కుతూ మరిగే నీటి సరస్సు సందర్శనీయ స్థలాలు.